నమస్తే తెలంగాణ
జిందగీ 13
హైదరాబాద్ | ఆదివారం 31 మార్చి 2024 www.ntnews.com



## సోనమ్.. సో మాడ్రన్!

**'టేట్ మాడ్రన్..'** ప్రపంచంలోని ఆధునిక, సమకాలీన కళలకు ఆలవాలమైన అతిపెద్ద మ్యూజియంలలో ఒకటి. లండన్‌లోని ఈ ప్రతిష్ఠాత్మక మ్యూజియం తన దక్షిణాసియా అక్విజిషన్ కమిటీలో బాలీవుడ్ బ్యూటీ సోనమ్ కపూర్‌ను సభ్యురాలిగా చేర్చుకున్నది. టేట్ మాడ్రన్ ద్వారా చాంపియన్ ఇండియన్, సౌత్ ఏషియన్ ఆర్ట్‌లో ఈ కీలక సభ్యత్వ స్థానానికి ఎంపికైన ఏకైక భారతీయ నటిగా నిలిచింది సోనమ్ కపూర్. 'ప్రపంచ ప్రఖ్యాత టేట్ మాడ్రన్ వారి సౌత్ ఏషియన్ అక్విజిషన్ కమిటీ మెంబర్‌గా చేరడం ఎంతో గర్వంగా ఉంది. భారతీయ, దక్షిణాసియా కళా వారసత్వం ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందుతున్నది. మన కళాఖండాలు ఈ చరిత్రాత్మక వేదికపై ఉంచేందుకు, కళాకారుల అభ్యున్నతికి కృషి చేయడానికి వీలు చిక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవకాశం నా ఒక్కదానికే కాదు, మొత్తం ఆర్ట్ కమ్యూనిటీకి గర్వకారణం' అని చెప్పుకొచ్చింది సోనమ్ కపూర్.

## ఇప్పుడు ఆ యాసలో..

**'బలిసిందారా..** బొక్కలిరగ్గొడ్తా నకరాలా..!' అని తన తొలి తెలుగు సినిమాలోనే కుర్రకారు గుండెల్లో రౌడీపిల్లగా నిలిచిపోయింది సాయిపల్లవి. 'ఫిదా'లో అచ్చ తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన మాస్ డైలాగులు సూపర్ హిట్ అయ్యాయి. ఆ సినిమాలో భానుమతి పాత్ర కోసం ఈ భామ పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఎడ్లబండి తోలడం, బురద పొలంలో ట్రాక్టర్ నడపడం అలవోకగా చేయడం ద్వారా ఔను, భాను ఖతర్నాక్ పిల్ల.. ఒక్కటే పీస్ అనిపించుకుంది! తమిళనాడులో పుట్టినప్పటికీ తెలుగమ్మాయి కన్నా స్పష్టంగా మన భాష మాట్లాడుతుంది. మొదటి చిత్రంలో పక్కా తెలంగాణ పల్లెటూరి పిల్లగా మెప్పించిన ఈ తమిళ సోయగం.. ఈసారి ఉత్తరాంధ్ర యాసలో డైలాగ్స్ చెప్పేందుకు సిద్ధమవుతున్నది. నాగచైతన్య సరసన 'తండేల్' చిత్రంలో నటిస్తున్న ఆమె ఆ పాత్ర కోసం సిక్కోలు యాసలో శిక్షణ తీసుకుంటున్నదట. ఆమెకు శిక్షణ ఇచ్చేందుకు చిత్ర దర్శకుడు చందు మొండేటి ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర మాండలిక నిపుణుడిని నియమించాడని టాక్. తెలంగాణ యాసలో జెమ్ అనిపించుకున్న సాయి పల్లవి ఇప్పుడు ఉత్తరాంధ్ర స్లాంగ్‌లో ఎలా మెప్పిస్తుందో చూడాలి!





'చూపే బంగారమాయెనే...' పాటేమో గానీ, బన్ని స్టెప్పు ప్రపంచవ్యాప్తమైంది. 'నాటు నాటు..' పాటలో తారక్, చరణ్ ఆట ఆస్కార్‌లో అదరగొట్టింది. ఇప్పుడు టాలీవుడ్ స్టెప్పేస్తే... హాలీవుడ్ కూడా చిందేస్తున్నది. దశాబ్దాలు వెనక్కి వెళ్తే... అప్పటి కాలానికి తగ్గ నృత్యాలు వెండితెరపై బంగారు కాంతులీనాయి. నవరసాలనూ ఆవిష్కరించగలిగే కళా సాధనం నాట్యం. సినిమా సకల కళల సమ్మేళనం అయినప్పుడు... అందులో డ్యాన్స్ పాత్రను తక్కువ చేసి చూడలేం.

# టాలీవుడ్ స్టెప్పేస్తే..



**1932లో** తొలి తెలుగు సినిమా 'భక్తప్రహ్లాద' వచ్చిన నాటి నుంచి నేటి వరకూ వెండితెరపై నృత్యం రకరకాల స్టెప్పులు వేస్తూ వచ్చింది. ట్రెండుకు తగ్గట్టుగా నయా రీతుల్ని సంతరించుకుంది. మూడు గంటలు సుదీర్ఘంగా కథ చెప్పాల్సి వచ్చినప్పుడు.. ప్రేక్షకులకు విసుగు రాకుండా, మధ్య మధ్య పంచదార పలుకుల్లా ఒక నృత్యరూపకాన్ని సినిమాలో చొప్పించేవారు నాటి దర్శకులు. ఇది.. సినిమా తొలినాళ్ల ముచ్చట. దాని కోసం ప్రత్యేకంగా కొందరు నర్తకీమణులు ఉండేవాళ్లు. అసందర్భంగా కాకుండా, కథకు ఎక్కడ అవసరమో అక్కడ శాస్త్రీయ నృత్యరూపకమో, జానపద నృత్యమో వచ్చేలా చూసేవాళ్లు. ఎందుకంటే తొలినాటి కథానాయికలెవరూ నాట్యం పెద్దగా తెలిసినవాళ్లు కాదు. మంచి గాత్రం, అభినయ పాటవం ఉన్న రంగస్థల కళాకారులనే సినిమాల్లో తీసుకునే రోజులవి. కన్నాంబ, కాంచనమాల, కృష్ణవేణి, బి.జయమ్మ, శాంతకుమారి.. వీరంతా రంగస్థల కళాకారులే.. డ్యాన్సర్లుకాదు.

**తెలుగుతెరపై** నాట్యంలో మెలకువలు తెలిసిన తొలి కథానాయిక అంటే భానుమతి రామకృష్ణ అనే చెప్పాలి. అంతగొప్పగా కాకపోయినా.. సంప్రదాయ నృత్యాన్ని తాళానుగుణంగా లయబద్ధంగా నర్తించగలిగేవారు ఆమె. 1945లో భానుమతి నటించిన 'స్వర్గసీమ'లో 'ఓ హోహో.. పావురమా..' పాటలో ఆమె నాట్యం, హావభావాలు నాటి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయని చెప్పుకొంటారు. ఆ తర్వాత 'రత్నమాల'(1947), 'లైలామజ్ను'(1949) చిత్రాల్లో కూడా తనదైన శైలిలో చక్కని డ్యాన్స్ మూమెంట్స్ ఇచ్చారు. మల్లీశ్వరి, చింతామణి, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ తదితర చిత్రాల్లో భానుమతి నాట్యకౌశలాన్ని చూడొచ్చు.

**నృత్యం** పరంగా తెలుగు సినిమాను మరోస్థాయిలో నిలబెట్టిన నటి అంజలీదేవి. స్వతహాగా అంజలి నాట్యతార. సినిమాల్లోకి రాకముందే ఆమె నర్తకి. ఆమెలోని నృత్య ప్రతిభను గమనించే దర్శకుడు సి.పుల్లయ్య 'గొల్లభామ' (1947)లో అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత బాలరాజు (1948), కీలుగుర్రం (1949), పల్లెటూరిపిల్ల (1950) చిత్రాలతో అప్పటి యువతరానికి హాట్ ఫేవరెట్ అయ్యారు అంజలి. అప్పట్లో ఆడపిల్లలంతా 'అందానికి నేను అంజలి నోయీ..' అనేవారట.

**రానురాను** వెండితెరపై డ్యాన్స్ తప్పనిసరి అయింది. సినిమాకు చెందిన 24 శాఖల్లో నృత్యం ప్రధాన శాఖగా రూపాంతరం చెందింది. వేదాంతం రాఘవయ్య, వెంపటి పెద్ద సత్యం, వెంపటి చిన సత్యం, పసుమర్తి కృష్ణమూర్తి, గోపీనాథ్, పీఎస్ గోపాలకృష్ణన్, ఏకే చోప్రా వంటి ఉద్దండులైన డాన్స్‌మాస్టర్లు తెలుగు తెరను తమ నృత్యరీతులతో దేదీప్యం చేశారు. ముఖ్యంగా 1950 నుంచి 1970 మధ్య కాలంలో తెలుగు సినిమా డ్యాన్స్‌కు స్వర్ణయుగం. ఈ కాలంలో పరిచయమైన రాజసులోచన, ఎల్.విజయలక్ష్మి, జయలలిత, కాంచన, రాజశ్రీ, వాణిశ్రీ తదితర తారలు గొప్ప నర్తకీమణులుగా కూడా రాణించారు. ఈవీ సరోజ, రీటా, కుచలకుమారి, జ్యోతిలక్ష్మి, పి.ధర్మరాజు, ముక్కురాజు లాంటి డ్యాన్సర్లు తెలుగుతెరకు పరిచయమైంది కూడా ఈ జమానాలోనే. విజయావారి మాయాబజార్, జగదేకవీరుడికథ, లలిత శివజ్యోతి వారి 'లవకుశ', రాజ్యం పిక్చర్స్ 'నర్తనశాల', ఇంకా తెనాలి రామకృష్ణ, మహాకవి కాళిదాసు, మహామంత్రి తిమ్మరుసు, పాండవ వనవాసం, శ్రీకృష్ణ పాండవీయం.. ఇలా అద్భుతమైన సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రరాజాలు వచ్చింది ఈ దశాబ్దాల్లోనే. వీటిలో అద్భుతమైన పాటలకు, అంతే మనోహరమైన నృత్యాలు అమరాయి.

**1973లో** అక్కినేని 'బంగారుబాబు' విడుదలైంది. అప్పటి వరకూ హీరోయిన్లకూ, నృత్యతారలకు మాత్రమే పరిమితమైన 'డ్యాన్స్'.. హీరోలకు కూడా తప్పనిసరి అయింది. అందులో 'చెంగావి రంగుచీర కట్టుకున్న చిన్నది..' అంటూ వాణిశ్రీతో కలిసి అక్కినేని చేసిన డ్యాన్స్.. కొత్త ట్రెండ్‌కు నాంది పలికింది. ఆ పాటతో తెలుగు సినిమా నడకను సమూలంగా మార్చేశారు నృత్య దర్శకుడు హీరాలాల్. ఓ విధంగా ఏయన్నార్ కారణంగా ఎన్టీయార్‌కు కూడా డ్యాన్సులేయక తప్పలేదు.. అదంతా 'బంగారుబాబు' పుణ్యమే.

**ఎన్టీయార్** 'అడవిరాముడు' డ్యాన్సులకు ఓ ట్రెండ్ సెట్టర్. అందులోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను అరె..', 'అమ్మతోడు అబ్బతోడు నాతోడు నీతోడు..' పాటలు ప్రేక్షకులతో కూడా స్టెప్పులేయించాయి. ఆ సినిమా కొరియోగ్రాఫర్ పేరు సలీమ్. నృత్య దర్శకుడిగా సలీమ్ ఓ సంచలనం. అక్కినేనిని మినహాయిస్తే అప్పటి స్టార్ హీరోలైన ఎన్టీయార్, కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు.. వీరెవరూ డ్యాన్సుల్లో అంత ప్రవీణులు కాదు. కానీ వారి శారీరకభాషకు తగ్గట్టు స్టెప్పుల్ని క్రియేట్‌చేసి, తెలుగు సినిమా డ్యాన్సులను కొత్త పుంతలు తొక్కించాడు సలీమ్ మాస్టర్. ఆయనది ఏ స్థాయి ప్రభావం అంటే.. ఉమ్మడి రాష్ట్రంలో రికార్డింగ్ డ్యాన్స్ కల్చర్‌కి నాంది పలికింది సలీమ్ మాస్టర్ పాటలే. ఎన్టీయార్ చేసిన అడవిరాముడు, వేటగాడు, కొండవీటి సింహం, జస్టిస్‌చౌదరి, అలాగే అక్కినేని నటించిన శ్రీరంగనీతులు, ఏడంతస్తుల మేడ, ప్రేమాభిషేకం, యువరాజు, అనుబంధం, సూపర్‌స్టార్ కృష్ణ నటించిన ఊరికి మొనగాడు, అగ్నిపర్వతం, వజ్రాయుధం, ఖైదీ రుద్రయ్య.. ఇలా చెప్పుకొంటూపోతే సలీమ్ మాస్టర్ నృత్యరీతులు సమకూర్చిన ఎన్నో సినిమాల పాటలు రికార్డింగ్ డ్యాన్స్ కళాకారులకు జీవనోపాధిగా మారాయి.

**ఇక** 1970ల్లో కమల్‌హాసన్, చిరంజీవి లాంటి గొప్ప డ్యాన్సర్లు వెండితెరకు హీరోలుగా పరిచయం అయ్యారు. చిరంజీవి డ్యాన్సులకైతే ప్రేక్షకులు భక్తులుగా మారిపోయారు. సినిమా హీరో కావాలంటే డ్యాన్స్ ఒక అర్హతగా మారిపోయింది. హీరో అవ్వాలనుకునే ప్రతి నటుడూ డ్యాన్స్ నేర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్టీయార్, ఏయన్నార్ కూడా తమ వారసులకు డ్యాన్స్‌లు నేర్పించి పరిశ్రమకు పరిచయం చేశారంటే, దానికి కారణం చిరంజీవి. హీరోయిన్లలో కూడా జయప్రద, శ్రీదేవి, భానుప్రియ, రమ్యకృష్ణ లాంటి అద్భుతమైన డ్యాన్సర్లు ఇండస్ట్రీకి పరిచయం అయ్యారు.

**సలీమ్‌తోపాటు** తార, సుందరం మాస్టర్, శివసుబ్రహ్మణ్యం లాంటి డ్యాన్స్ మాస్టర్లు 80ల్లో తెలుగు సినిమాను చిందులు వేయించారు. చిరంజీవితోపాటు బాలకృష్ణ కూడా మంచి డ్యాన్సర్‌గా ప్రేక్షకుల మన్ననలు అందుకున్నాడు.



అప్పటి డ్యాన్స్‌మాస్టర్లు ఒక్కొక్కరిదీ ఒక్కో స్టయిల్. పాట చూడగానే.. ఇది ఫలానా కొరియోగ్రాఫర్‌ది అని చెప్పేవాళ్లు. నృత్య దర్శకుల్లో ఈ తరానికి ఆదర్శం ప్రభుదేవా. సలీమ్ మాస్టర్‌లా హీరో బాడీలాంగ్వేజ్‌కు తగ్గట్టు స్టెప్పులు క్రియేట్ చేయడం ప్రభుదేవా స్టయిల్. డ్యాన్స్‌ను ఇరగదీసే చిరంజీవి, బాలకృష్ణలకూ, అంతగా స్టెప్పులు వేయలేని మోహన్‌బాబు, రాజశేఖర్‌కు ప్రత్యేకమైన నృత్యరీతుల్ని సృష్టించిన ఘనత ప్రభుదేవాదే. లారెన్స్ కూడా దాదాపు ప్రభుదేవా దారిలోనే పయనించాడు.

**ఇక** నేటి సినిమాల్లోని డ్యాన్సుల విషయానికొస్తే.. దాదాపు అన్ని సినిమాల్లో డ్యాన్సులు ఒకేలా ఉంటున్నాయనే అభిప్రాయం ప్రేక్షకుల్లో ఉంది. అప్పట్లో ప్రతి నృత్య దర్శకుడికీ ఓ స్టయిల్ ఉండేది. హీరో శారీరక భాషకు తగ్గట్టు స్టెప్పుల్ని క్రియేట్ చేసేవారు. ఒకరిద్దరికి తప్ప ఇప్పుడు అందరు హీరోలూ ఒకే తరహా స్టెప్పులను ఆశ్రయిస్తున్నారు. అయినా.. కొన్ని డ్యాన్సులు ట్రెండ్ సృష్టిస్తున్నాయి. పాటల్లో లాలిత్యం తగ్గినా.. డ్యాన్సుల్లో మాత్రం వైవిధ్యం కనిపిస్తున్నది. తారక్, బన్నీ, చరణ్ లాంటి అద్భుతమైన డ్యాన్సింగ్ స్టార్లు అవకాశం వచ్చిన ప్రతిసారీ.. అదరగొడుతున్నారు. అయితే, ప్రతి సినిమాలోనూ వారి డ్యాన్సులు కూడా ఒకేలా ఉంటున్నాయనే అభిప్రాయం జనాల్లో నెలకొని ఉంది. చివరిగా, డ్యాన్సుల్లో టాలీవుడ్ తర్వాతే ఏ పరిశ్రమ అయినా అన్న వాదనా వినిపిస్తుంటుంది!

... బుర్రా నరసింహా



## కోర్టు కహానీ

ఓటీటీ హిట్

**మామ్లా లీగల్ హై!**

**నెట్‌ఫ్లిక్స్:** మార్చి 1
**తారాగణం:** రవికిషన్, నైలా గ్రేవాల్, నిధి, అనంత్ జోషి తదితరులు
**దర్శకత్వం:** రాహుల్ పాండే

ఓటీటీలో సినిమాలకన్నా వెబ్‌సిరీస్‌లే ఎక్కువ స్ట్రీమింగ్ అవుతున్నాయి. సస్పెన్స్ థ్రిల్లర్స్‌కు జనం నీరాజనం పడుతున్నారు. కామెడీ వెబ్‌సిరీస్‌లనూ అదే రేంజ్‌లో ఆదరిస్తున్నారు. కాస్త కామెడీ ఫ్లేవర్‌తో కోర్టు వ్యవహారాలు, న్యాయవాదుల పరిస్థితులను తెలియజేస్తూ వచ్చిన 'మామ్లా లీగల్ హై' మంచి టాక్ తెచ్చుకుంది. 'రేసుగుర్రం', 'కిక్ 2'తో తెలుగు ప్రేక్షకులకు చేరువైన భోజ్‌పురి నటుడు రవికిషన్ ఇందులో ప్రధాన పాత్ర పోషించాడు. కథలోకి వెళ్తే.. ఢిల్లీ పరిధిలోని 'పట్‌పర్‌గంజ్' జిల్లా కోర్టులో త్యాగి (రవికిషన్) అడ్వొకేట్‌గా పనిచేస్తుంటాడు. పట్‌పర్‌గంజ్ న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడిగా ఉంటాడు. జడ్జిగా పనిచేసిన త్యాగి తండ్రికి అపారమైన పేరుప్రఖ్యాతులు ఉంటాయి. తండ్రి పేరు వాడుకోకుండా తన కష్టంతోనే పైకి రావాలని అనుకుంటాడు త్యాగి. ఢిల్లీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కావాలని భావిస్తుంటాడు. అటార్నీ జనరల్ కావడమే జీవిత లక్ష్యంగా పెట్టుకుంటాడు. మరోవైపు పట్‌పర్‌గంజ్ కోర్టు వ్యవహారాలు ప్రేక్షకులకు నవ్వు తెప్పిస్తాయి. కేసుల వాదనలు, లాయర్ల సమస్యలు, లాయర్ల మధ్య రాజకీయాలు ఇలా కలగాపులగంగా నడుస్తుంటాయి. మరోవైపు లాయర్ సుజాత కోర్టు ఆవరణలో ప్రత్యేకమైన చాంబర్ దక్కితే చాలు అనుకుంటుంది. సంపన్న కుటుంబానికి చెందిన అనన్య విదేశాల్లో న్యాయ విద్య అభ్యసిస్తుంది. లాయర్‌గా గొప్ప పేరు తెచ్చుకొని, ప్రజలకు న్యాయం అందించాలన్నది ఆమె ఆశయం. ఈ ముగ్గురి లక్ష్యాలు నెరవేరాయా? ఢిల్లీ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో త్యాగి గెలిచాడా? అన్నది మిగిలిన కథ! పెద్దగా మలుపులు లేకపోయినా... హాస్యభరితంగా సాగిన 'మామ్లా లీగల్ హై!' ప్రేక్షకులను అలరిస్తుంది.



## మరో మెట్టుకు మంగ్లీ



**జానపద** గీతాలతో ప్రాచుర్యంలోకి వచ్చిన మంగ్లీ అందరికీ సుపరిచితురాలే! సినిమా పాటలతోనూ తన సత్తా చాటిన ఈ లోకల్ స్టార్.. గ్లోబల్ వేదికపైనా తన మధురిమలు వినిపించి అదరహో అనిపించింది. ఇటీవల బెంగళూరుకు చెందిన స్వధా ఫౌండేషన్ నిర్వహించిన 'మార్గా 2024' ఈవెంట్‌లో ఉషా ఉతుప్, సుధా రఘునాథన్ లాంటి లబ్ధప్రతిష్ఠులైన గాయకులతో కలిసి వేదిక పంచుకుంది. సంగీత ప్రపంచంలో ఆమె అందుకున్న విజయాలకు గానూ ఇటీవలే సంగీత నాటక అకాడమీ నుంచి 'ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్' యువ పురస్కారానికి ఎంపికైంది. ఇలా అంచెలంచెలుగా ఎదుగుతున్న సత్యవతీ చౌహాన్ అలియాస్ మంగ్లీ ఆడబిడ్డలందరికీ ఆదర్శంగా నిలుస్తున్నది.



## గ్లామర్ స్క్వేర్

**'టిల్లు స్క్వేర్'తో** అందరినీ ఆకట్టుకున్న నటి అనుపమ పరమేశ్వరన్. ఒద్దికగా ఉండే ఈ చిన్నది.. ఒక్కసారిగా కెరటంలా ఎగిసిపడటంతో అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇదే విషయమై అనుపమను అడిగితే.. లిల్లీ పాత్ర తనకెంతో నచ్చిందని చెప్పుకొచ్చింది. 'నా తొలి సినిమా 'ప్రేమమ్'. అప్పుడు నా వయసు 19 ఏండ్లు. నా కెరీర్ ప్రారంభమై పదేండ్లవుతున్నది. మూడేండ్లుగా ప్రయోగాత్మక పాత్రలను ఎంపిక చేసుకుంటున్నా. ఆ టైమ్‌లో నా దగ్గరికి 'టిల్లు స్క్వేర్' కథ వచ్చింది. చాలా నచ్చింది. ఆ సినిమాలోని లిల్లీ పాత్రను వదులుకోకూడదని డిసైడ్ అయ్యా. నా కెరీర్‌లో ఈ పాత్ర ప్రత్యేకం. ఇంతకుముందు అన్ని సినిమాల్లో ఒకేలాంటి పాత్రల్లో నటించడంతో బోర్ ఫీలయ్యా! లిల్లీ పాత్ర గ్లామర్‌తోపాటు పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్నది. పాత్ర కోసం గ్లామర్‌గా కనిపించానే తప్ప హీరోయిన్ ఇమేజ్ కోసం కాదు.. అయినా అందంగా కనిపించడం మంచిదే కదా!'.. అంటూ నవ్వుతూ చెప్పిందీ గ్లామర్ స్క్వేర్ గర్ల్!!